క్లుప్తంగా

పైప్‌లైన్ పనుల పరిశీలన



ఊట్కూరు: మండలంలోని గాంధీనగర్ పాతట్యాంక్ నుంచి కొత్త ట్యాంక్ వరకు కొనసాగుతున్న పైపులైన్ పనులను ఎంపీడీఓ ధనుంజయ్ గౌడ్ పరిశీలించారు. పనులను నాణ్యతతో చేపట్టాలని అధికారులకు సూచించారు. గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాపై చర్యలు తీసుకోండి

కృష్ణా: మండలంలోని టైరోడ్డులో గల కృష్ణానది నుంచి రాత్రి వేళలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని ఆ గ్రామ ప్రజలు శుక్రవారం విలేకరులకు తెలియజేశారు. గ్రామంలోని కొందరు ట్రాక్టర్ల ద్వారా పొలాల్లో ఇసుక డంపులు ఏర్పాటు చేసి ఇతర గ్రామాలకు తరలిస్తున్నారని, ఈ విషయంపై అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గ్రామంలోని ఇల్లు కట్టుకునే వారికి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5వేల నుంచి రూ.6వేలకు అమ్ముతున్నారన్నారు. ప్రభుత్వం ఇళ్లు కట్టుకునే వారికి ఉచితంగా అనుమతువ్వాలని కోరారు.

యథేచ్ఛగా ఇసుక దందా

మాగనూర్: మండలంలోని పలు గ్రామాల్లో ఇసుకదందా యథేచ్ఛగా సాగుతోంది. మండలం నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుక తరలుతున్న అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి మండలంలోని ఆయా గ్రామాల్లో సాగుతున్న అక్రమదందాపై ఉక్కుపాదం మోపాలని సమీప పొలాల రైతులు కోరుతున్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



మక్తల్: రంజాన్‌పండుగ సందర్భంగా శుక్రవారం మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో 12వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ ఇర్ఫానా అన్వర్ హుస్సెన్ నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. దాదాపు 150మంది నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో హైమద్, శాంతికుమార్, మనస్, మహబూబ్ ఆలీ, మున్వర్‌ఆలీ, సాధిక్, ఆయూబ్ మేరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ



మాగనూర్: మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం రాత్రి గాయపడిన మాగనూర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త వెంకటయ్యగౌడ్ మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా శుక్రవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. ఈ మేరకు.. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, నర్సింహారెడ్డి, వాకిటి శ్రీనివాసులు, బిల్డర్ తాయప్ప పాల్గొన్నారు.

మొక్కలకు నిప్పు..



ధన్వాడ: మండల కేంద్రం నుంచి కంసాన్‌పల్లికి వెళ్లేదారిలో రోడ్డుకు ఇరువైపుల నాటిన మొక్కలను కొందరు నిప్పుపెట్టారు. ప్రభుత్వం నిధులను వెచ్చించి మొక్కలను పెంచుతుంటే కొంతమంది వాటిని తొలగించేందుకు నిప్పుపెట్టి కాల్చి వేస్తున్నారు. అధికారులు సందించి వారిపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మరికల్: మండలంలోని ఇబ్రహీంపట్నం గ్రామానికి వెళ్లే రోడ్డు ఇరువైపుల నాటిన మొక్కలకు శుక్రవారం గుర్తు తెలియన వ్యక్తులు నిప్పంటించారు. మరికల్ నుంచి ఇబ్రహీంపట్నంకు వెళ్లే ప్రధాన రోడ్డుకు గతేడాది నాటిన మొక్కలు మంటలకు కాలిపోవడంతో వారిపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మొక్కల సంరక్షణపై దృష్టి సారించండి

అమరచింత: మండలంలోని ఆయా గ్రామాల్లో రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలను సంరక్షించేందుకు దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. చెట్టుచెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొంకన్‌వానిపల్లి గ్రామంలోని నర్సరీని సందర్శించి రహదారి పక్కన నాటిన మొక్కలకు నీటిని అందించారు. ఈమేరకు మొక్కల సంరక్షణ కోసం తీసుకుంటున్న జాగ్రత్తల గురించి పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు.

శిథిల భవనంలో భావితరం

- మరికల్‌లో శిథిలావస్థకు చేరిన 71 ఏళ్లనాటి పాఠశాల
- చెట్ల కింద తరగతుల నిర్వహణ.. ఇబ్బందుల్లో విద్యార్థులు
- అందుబాటులోకి రాని నూతన గదులు



మరికల్ బాలుర ఉన్నత పాఠశాల భవనం



ఇరుకు స్థలంలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

మరికల్: ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్‌కు పునాదిగా మారిన జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలకు 71 ఏళ్లు పూర్తి చేసుకుంది. ప్రస్తుతం ఈ పాఠశాల శిథిలావస్థకు చేరింది. మరోదిక్కు విద్యార్థులకు సరిపడా గదులు లేక ఇబ్బందుల మధ్య ఉపాధ్యాయులు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా మన ఊరు– మన బడి పథకం కింద అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి కావొచ్చిన బిల్లులు రాక కాంట్రాక్టర్ నూతన భవనాలను అప్పగించడం లేదు. దీంతో చెట్ల కింద వరండాలో ఉపాధ్యాయులు తరగతులు నిర్వహిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. అలాగే మరికల్‌తోపాటు మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ప్రభుత్వ బడులు దీనస్థితికి చేరుకుంటున్నాయి.

పాఠశాల ప్రస్తవన..

మరికల్‌లో 1953లో జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను నిర్మించారు. మొదటి ప్రధానోపాధ్యాయులుగా హన్మయ్య పని చేశాడు. 70మంది విద్యార్థులతో పాఠశాల ప్రస్తవన మొదలై నేడు 680మంది విద్యార్థులకు చేరుకుంది. ఇప్పటి వరకు 25మంది హెచ్‌ఎంలు ఇక్కడ విధులు నిర్వహించారు. ప్రతి ఎడాది 90శాతానికి పైగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఇక్కడ చదివిన పూర్వ విద్యార్థులు ఎన్నో ఉన్నత ఉద్యోగులను, పదవులను పొందిన వారు కూడా ఉన్నారు. కొందరు పదవీ విరమణ కూడా పొందారు. పాఠశాల నిర్మించి నేటికి 68సంవత్సరాలు గడుస్తుంది. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో మూడేళ్ల క్రితం భారీవర్షాలకు ఉపాధ్యాయులకు సంబంధించిన విశ్రాంతి గది కూలిపోయింది. ఇదే తరహాలో మరో 7తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటికి కూడా ప్రమాదం పొంచివుంది. గత ప్రభుత్వం పాఠశాలను బలోపేతం చేసేందుకు మన ఊరు–మనబడి కార్యక్రమం చేపట్టి నూతన భవనాలను నిర్మించారు. కాని అవి ప్రారంభం కాకపోవడంతో విద్యార్థుల ఇబ్బందులు తారస్థాయికి చేరుకుంటున్నాయి.

మండలంలో ఇలా...

మరికల్‌లో 21 ప్రాథమిక, ప్రాథమికొన్నత పాఠశాలలు ఉండగా, 5 జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 3589 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిన్నారం, మరికల్, కన్మనూర్, ఇబ్రహీంపట్నం, రాకొండ, చిత్తనూర్ గ్రామాల్లో ప్రభుత్వ బడులు శిథిలావస్థకు చేరుకున్నాయి. అదనపు తరగతి గదుల నిర్మాణంకోసం పనులు ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్న పూర్తి కావడం లేదు. ప్రభుత్వం నుంచి సకాలంలో బిల్లులు రాకపోవడంతో గదుల నిర్మాణ పనులు ఆలస్యంగా కొనసాగుతున్నట్లు కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బిల్లులు రావాల్సింది..

పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనంకు బిల్లులు రావాల్సింది. ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. బిల్లులు మంజూరైన వెంటనే పాత భవనాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

– అబ్దుల్‌ఘని, డీఈఓ

భూ బాధితులకు న్యాయం చేయాలి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న బాధిత రైతులు

నారాయణపేట: జిల్లాలో మక్తల్, నారాయణపేట నియోజకవర్గాల్లోని నాలుగు మండలాల పరిధిలోని 19 గ్రామాల మీదుగా 56కిలోమీటర్ల మేర భారత్ మాల జాతీయ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కొండన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు నష్టపరిహారం చెల్లించాలని శుక్రవారం కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని బాధిత రైతులను ఎన్నికల కోడ్ నేపథ్యంలో స్వామి వివేకానంద మున్సిపల్ పార్క్ ధర్నా చౌక్ వద్దనే అడ్డుకున్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఏఓకు అనంతరం అదనపు కలెక్టరు అశోక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. బాధితులకు బహిరంగ మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించకుండా కాలయాపన చేస్తుందన్నారు. మరికల్, గుడిగండ్ల, జక్లేరు, కాచ్‌వార్, మక్తల్, మాగనూరు, గుడెబల్లూర్ టై రోడ్డు వాసునగర్‌ల గుండా 56 కిలోమీటర్ల పరిధిలోని 19 గ్రామాల్లోని నిరుపేద రైతుల భూములని సేకరించిన కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వడంలో జాప్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్‌మాల భూ బాధితులు రంకుల రామలింగ, ప్రసాద్, దామోదర్ రెడ్డి, ఎర్రకొండన్న, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న ప్రత్యేక బలగాలు

కోస్గి: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని, ప్రజలు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని ఎస్ఐ శేఖర్ గౌడ్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని సమస్యాత్మకమైన కడంపల్లి, మాసాయపల్లి గ్రామాల్లో పోలీసులు, కేంద్ర ప్రత్యేక బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ కోసమే పోలీసు శాఖ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తుందని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో మనోధైర్యం కల్పించడంతోపాటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే పోలీసుశాఖ లక్ష్యంగా ఇలాంటి ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో ప్రత్యేక పోలీస్ బలగాలతో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎఎఫ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో నర్సరీలను కాపాడాలి



భీంపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మద్దూరు: వేసవి కాలంలో నర్సరీలను కాపాడాలని ఎంపీడీఓ జయరాములు నర్సరీల నిర్వాహకులకు ఆదేశించారు. నర్సీలపై గ్రీన్ కవర్ ఏర్పాటుచేయడంతోపాటు ఉదయం సాయంత్రం నీటిని అందించాలన్నారు. శుక్రవారం ఎంపీఓ సిద్దేశ్వర్‌తో కలిసి మండలంలోని భీంపూర్, నాగంపల్లి నర్సరీలను పరిశీలించారు. నర్సరీలో మొక్కల ఎగుదలపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



మాట్లాడుతున్న వెంకటేష్

నారాయణపేట రూరల్ : పట్టణం, మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆద్వర్యంలో సహిద్ భగత్‌సింగ్ వర్ధంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించి ఆయన జీవిత విశేషాలను వివరించారు. స్థానిక మార్కెట్‌లేన్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేష్ పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్య సమరంలో భగత్‌సింగ్ ఎంతో కృషి చేశారని, ప్రతి ఒక్కరు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోషాధికారి గౌస్, రాజు విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని కోటకొండ గ్రామంలో భగత్‌సింగ్ విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ, పీవైఎల్, ఎస్ఎఫ్ఐ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



తిర్మలాపూర్‌లో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

నారాయణపేట రూరల్ : ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అలరించాయి. మండలంలోని తిర్మలాపూర్ యూపీఎస్, శ్యాసన్‌పల్లి పీఎస్ పాఠశాలల వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులు చక్కటి వేశాధారణతో దేశభక్తి, దైవభక్తి పాటలకు నృత్యాలు చేశారు. అంతకుముందు నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు మొల్గాన్‌జనార్ధన్, జగదీష్, టీచర్లు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి సింగిల్ విండో చైర్మన్



నారాయణపేట: పేట సింగిల్ విండో చైర్మన్ కొంకల్ నర్సింహారెడ్డి, విండో డైరెక్టర్ సూరత్ మల్లప్ప, బీఆర్ఎస్ నాయకులు తిమ్మప్ప శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరడంతో వారికి కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ నేతృత్వంలో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుతో పాటు పలు సంక్షేమ, అభివృద్ధికి ఆకర్షితులమై కాంగ్రెస్ పార్టీలో చేరమన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నారాయణపేట మండలాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

ధన్వాడ: మండల కేంద్రంలోని కుర్వ వీధిలో తాగునీటి ఎద్దడికోసం కాలనీవాసులు ఎమ్మెల్యే పర్ణికారెడ్డికి వినతిచేయడంతో స్పందించిన ఆమె మండలంలో రెండు బోర్లును మంజురూ చేశారు. కుర్వ వీధిలోని చెరువు కట్ట వద్ద బోరును డ్రీల్ చేశారు. ఈ మేరకు.. ఎమ్మెల్యేకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

సైబర్ నేరాలపై అవగాహన

మాగనూర్: మండల కేంద్రంలోని శుక్రవారం మూఢనమ్మకాలు, సైబర్‌నేరాలు తదితర అంశాలపై ప్రజలకు పోలీస్ సిబ్బంది అవగాహన నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మీకు బంపర్ డ్రా తగిలిందని ఫోన్‌కు ఎస్ఎంఎస్ వచ్చి వాటిపై క్లిక్ చేయమని చెప్పగానే వెంటనే అకౌంట్‌లో నుంచి మొత్తం డబ్బులు పోవడం, ఏటీఎం కార్డుల ద్వారా డబ్బులు డ్రా చేస్తామని చెప్పి కార్డులు మార్చి డబ్బులు కొట్టేయడం అటువంటి వారిపై జాగ్రత్త అవసరమని తెలియజేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఉమేష్‌గౌడ్, కానిస్టేబుల్స్ మహేష్, సాయికుమార్, ఖాజాపాష తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



శ్యాసన్‌పల్లిలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్ : మండంలోని శ్యాసన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈమేరకు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి వారికి పాఠాలు బోధించారు. అనంతరం చక్కగా బోధించిన వారికి గ్రామ పెద్దలు హాజరై బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం జగదీష్, ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, కృష్ణవేణి, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

పనుల పరిశీలన

దేవరకద్ర: మండల కేంద్రంలోని మల్లెల పాపయ్య కుంటలో పూడిక తీత పనులను జిల్లా ఉపాధి హామీ డీబీటీ లక్ష్మీనారాయణ పరిశీలించి కూలీలతో మాట్లాడారు. బిల్లులు ఎప్పటి కప్పుడు చేస్తే డబ్బులు సకాలంలో అందిస్తామన్నారు. ఏపీఓ సంజీవ్‌కుమార్, ఎఫ్ఏ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సీమంతంలో పాల్గొన్న గర్భిణులు

మద్దూరు: గ్రామాల్లో అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీడబ్ల్యూఓ నర్సింహారావ్ సూచించారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరధిలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ప్రాజెక్టు పరిధిలోని ఆయా మండలాలకు చెందిన గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్న ప్రాసన రైతు వేదికలో నిర్వహించారు. గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం పౌష్టికాహార లోపం నిర్వహించడానికి అంగన్‌వాడీలను ఏర్పాటు చేసిందనిసూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించి, చిన్నారులకు అధికారులు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీడీపీఓ గిరిజా, ఎంపీడీఓ జయరాములు, సూపర్‌వైజర్లు ఆశాజ్యోతి, రూప, మాదవి, సరోజ, రాధిక, రాజ్యలక్ష్మి, నీలబాయి, ప్రాజెక్టు పరధిలోని అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

నీటి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



జాజాపూర్‌లో సేవ్ వాటర్ అనే ఆంగ్ల అక్షరాలతో విద్యార్థులు

నారాయణపేట రూరల్: భవిష్యత్ తరాలకు అవసరమైన తాగు, సాగునీరు అందాలంటే నీటి వృథాను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డీఎస్ఓ భానుప్రకాష్ అన్నారు. మండలంలోని జాజాపూర్ జెడ్పీస్కూల్‌లో ప్రపంచ జల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నీటి అవసరాలు, సంరక్షణపై వివిధ రకాలైన పోటీలు, కార్యక్రమాలను నిర్వహించారు. చక్కటి ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు. అనంతరం నీటిని సంరక్షించాలనే నినాదంతో ఆంగ్లంలో సేవ్ వాటర్ అంటు విద్యార్థులు మైదానంలో కూర్చోని వినూతన్నంగా ప్రచారం చేపట్టారు. డీఎస్ఓ మాట్లాడుతూ.. సహజ వనరులైన నీటిని ప్రతి ఒక్కరూ బాధ్యతగా కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభారాణి, మధుసూదన్‌రావు, విజయ్ కుమార్, లక్ష్మన్, సురేఖ, నిర్మల, కృష్ణవేణి, వెంకటేష్ పాల్గొన్నారు.

కోస్గి: సకల జీవజాతికి జలమే ప్రాణాధారమని సైన్స్ ఉపాధ్యాయుడు మల్లేశం సూచించారు. ఈ మేరకు ప్రపంచ జలదినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని ముశ్రీఫా జెడ్పీ ఉన్నతపాఠశాలలో అవగాహన నిర్వహించారు. ప్రస్తుతం పెరుగుతున్న జనాభా దృష్ట్యా నీటి సంరక్షణ, పొదుపుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి, నీటిని పొదుపుగా వాడుతామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మరికల్: ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మండలంలోని శుక్రవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లకార్డులు పట్టుకొని నీటి అవశ్యకతను గ్రామస్తులకు వివరించారు. నీరు లేనిదే ఈ సృష్టి లేదని, ప్రతి జీవి, మొక్కలు బతకాలంటే నీరు ఎంతో అవసరమని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



మరికల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



కోస్గిలో..

ప్రార్థన మందిరాలలో తనిఖీలు



మందిరాల వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఊట్కూరు: మండలంలోని రంజాన్ మాసం సందర్భంగా శుక్రవారం ప్రార్థన మందిరాల వద్ద పోలీసులు జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. ముందస్తు భద్రత చర్యలో భాగంగా ఎస్పీ యోగేష్‌గౌతం ఆదేశాల మేరకు బాంబ్‌స్కాడ్, డాగ్‌స్కాడ్‌లతో తనిఖీలు చేపట్టినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని ప్రార్థన మందిరాలు, ప్రధాన కూడలిలో తనిఖీలు చేపట్టారు.

పెద్ద చెరువులో పూడికతీత పనులు



కొనసాగుతున్న పూడికతీత పనులు

ధన్వాడ: మండల కేంద్రంలోని పెద్ద చెరువులో మూడు రోజులుగా పూడిక తీత పనులను కొనసాగిస్తున్నారు. కలెక్టర్ నిధుల నుంచి రూ.10 లక్షలను పూడిక తీత పనులకోసం మంజూరు చేశారు. పూడిక మట్టిని ధన్వాడ, కంసాన్‌పల్లి, పాతపల్లి, కొత్తపల్లి రైతల పొలాలకు తరలిస్తున్నారు. జీఓ నంబర్ 69 ప్రకారం పేట, కోడంగల్ ఎత్తిపోతల పథకం చేపడితే ధన్వాడ పెద్ద చెరువులోతు చేసి పెద్దఎత్తున నీటిని నిల్వచేసేందుకు అవకాశం ఉంది. ఇందులో ప్రస్తుతం కేటాయించిన నిధులతో 3 మీటర్ల మేర మట్టిని తవ్వుతున్నారు. జేసీబీలకు మాత్రమే ప్రభుత్వం నిధులను కేటాయిస్తుంది.

అంబలి కేంద్రం ప్రారంభం



విద్యార్థులకు అంబలి అందజేస్తున్న కరస్పాండెంట్

మరికల్: మండలంలోని తీలేర్ లిటిల్ స్టార్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థుల సౌకర్యం కోసం కరస్పాండెంట్ రాంచందర్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులకు వడదెబ్బ తగలకుండా ఉండేందుకు నెలరోజుల పాటు అంబలి అందజేస్తామని తెలిపారు. అనంతరం ఆయనను గ్రామస్తులు అభినందించారు.పాఠశాల ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

కోయిల్‌కొండ: ఉపాధిహామీ కూలీల సంఖ్యను పెంచాలని డీఆర్‌డీఓ నర్సిములు అన్నారు. శుక్రవారం మండలంలోని రాంపూర్, మల్కాపూర్, కోయిల్ కొండ గ్రామాల్లో పనులను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ కాలప్ప, ఎంపీఓ నజీర్ హైమద్ తదితరులు పాల్గొన్నారు.